సక్కు పూజలు

జైనథ్, మే 14 : పెండల్‌వాడలోని హనుమాన్ ఆలయంలో మంగళవారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు పూజలు చేశారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు ఆయు ఆరోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖంగా ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఈవీఎంలను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

స్ట్రాంగ్ రూంలకు సీల్

- ఈసీ మార్గదర్శకాలను అనుసరించి భద్రత
- పరిశీలించిన సాధారణ పరిశీలకుడు రాజేంద్రవిజయ్
- కట్టు దిట్టమైన భద్రత మధ్య ఓట్ల లెక్కింపు : రాజర్షి షా

ఎదులాపురం, మే 14 : ఆదిలాబాద్ జిల్లాలోని స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలను తరలించామని సాధారణ పరిశీలకుడు రాజేంద్ర విజయ్, రిటర్నింగ్ అధికారి రాజర్షి షా అన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి స్ట్రాంగ్ రూంలలో నియోజకవర్గాల వారీగా అమర్చామని తెలిపారు. మంగళవారం అభ్యర్థుల ఏజెంట్లు ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేంద్ర విజయ్, రిటర్నింగ్ అధికారి రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం సమక్షంలో స్ట్రాంగ్ రూంలకు సీల్ వేశారు. ఆదిలాబాద్ లోని సంజయ్‌గాంధీ పాలిటెక్నికల్ కాలేజీలో నిర్మల్, ముథోల్, ఖానాపూర్.. టీటీడీసీలో ఆదిలాబాద్, బోథ్.. సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల ఈవీఎంలను భద్రపర్చామని తెలిపారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్‌లు శ్యామలాదేవి, దీపక్‌తివారి, డీఆర్వో లోకేశ్, ఆర్డీవోలు వినోద్, రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, జీవాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీల్ వేసిన స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న సాధారణ పరిశీలకుడు రాజేంద్రవిజయ్, రిటర్నింగ్ అధికారి రాజర్షి షా, వివిధ పార్టీల నాయకులు

ఉట్నూర్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

ఓటెత్తారు..

- ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో పెరిగిన పోలింగ్
- ఈ సారి 74.03 శాతం.. గత ఎన్నికల్లో 71.5 శాతం
- గత ఎన్నికల కంటే 2.61 శాతం అధికం
- ఓటు హక్కుపై ప్రచారం చేయడమే కారణం

ఆదిలాబాద్, మే 14(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సోమవారం జరిగిన ఎన్నికల్లో 74.03 శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికలతో పోల్చితే ఈసారి అధికంగా ఓటు వేశారు. 2019 ఎన్నికల్లో 71.35 శాతం పోలింగ్ అవగా.. ఈ ఎన్నికల్లో 74.03 శాతం నమోదైంది. ఈసారి పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామాల్లో కూడా ప్రజలు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా 16,50,175 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 8,04,875 మంది పురుషులు, 8,45,213 మంది మహిళలు, 87 మంది ఇతరులు ఉన్నారు. ఎన్నికల్లో 12,21,565 మంది ఓటు వేయగా 74.03 శాతం పోలింగ్ నమోదైంది. 5,99,108 మంది పురుషులు, 6,22,420 మంది మహిళలు, 35 మంది ఇతరులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 74.43 శాతం, మహిళలు 73.64 శాతం ఓటు వేశారు.

బోథ్ నియోజకవర్గంలో అధికం

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలకు బోథ్‌లో అధిక పోలింగ్ నమోదైంది. బోథ్‌లో 2,11,313 మంది ఓటర్లకు 1,65,157 (78.16 శాతం) అధికంగా ఓటు వేశారు. సిర్పూర్ నియోజకవర్గంలో 2,29,101 మందికి 1,63,944(71.56 శాతం) తక్కువ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆసిఫాబాద్‌లో 2,27,208 మందికి 1,71,511(75.49 శాతం), ఖానాపూర్‌లో 2,24,523 మందికి 1,62,101(72.20 శాతం), ఆదిలాబాద్‌లో 2,45,137 మందికి 1,81,136(73.89 శాతం), నిర్మల్‌లో 2,58,314 మందికి 1,85,168(71.68 శాతం), మథోల్‌లో 2,54,579 మందికి 1,92,546(75.63 శాతం) పోలింగ్ నమోదైంది. అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఓటు హక్కు వినియోగంపై చైతన్యం రావడంతో గత ఎన్నికల కంటే ఈసారి పోలింగ్ శాతం పెరిగింది.

హమ్మయ్యా..

- ఊపిరి పీల్చుకున్న అధికార యంత్రాంగం
- నిర్మల్ జిల్లాలో 75.29 శాతం ఓటింగ్

నిర్మల్ టౌన్, మే 14 : ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. నిర్మల్ జిల్లాలో 7,37,416 మంది ఓటర్లు ఉండగా 75.29 శాతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నిర్మల్‌లో 306, ఖానాపూర్‌లో 309, ముథోల్‌లో 311 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ఫలితాలపై ఆసక్తి నెలకున్నది. ఈసారి పోలింగ్ శాతం పెంచేందుకు ప్రభుత్వం స్వీప్ ద్వారా చైతన్య కార్యక్రమాలు చేపట్టినా ఆశించిన స్థాయిలో ఓటింగ్ పెరగలేదు. 80 శాతానికి పైగా ఓటింగ్ పెంచాలని అధికారులు భావించినా లక్ష్యం నెరవేరలేదు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చైతన్య కార్యక్రమాలను నిర్వహించినా మార్పు కనిపించలేదని అంటున్నారు. ముథోల్‌లో 75.63, ఖానాపూర్‌లో 72.20, నిర్మల్‌లో 71.68 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. సోమవారం రాత్రి వరకు నిర్మల్ ఎన్‌టీఆర్ స్టేడియానికి ఈవీఎంలను తీసుకురాగా.. కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పర్యవేక్షణలో అదిలాబాదు జిల్లాకు తరలించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎస్పీ జానకి షర్మిల పోలింగ్‌ను సజావుగా కొనసాగడానికి చర్యలు తీసుకున్నారు. జూన్ 4న ఫలితాలు వెలువడనుండడంతో పోటీ చేసిన అభ్యర్థులు గెలుపుపై ధీమాతో ఉన్నారు.

బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత

ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, మే 14 : ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. మంగళవారం ఉదయం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీటీడీసీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా మూడు ప్రాంతాల్లోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచినట్లు తెలిపారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, పోలింగ్ సామగ్రి భద్రపరిచే స్ట్రాంగ్ రూంల భద్రత కొనసాగుతోంది. ఇందులో మొదటి వలయంలో కేంద్ర బలగాలైన సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్, రెండో భాగంలో జిల్లా రిజర్వ్ పోలీసులు, మూడో భాగంలో పట్టణ పోలీసులతో గస్తీ నిర్వహిస్తూ పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ జరిగే వరకు భద్రత ఉంటుందన్నారు. ఆపత్కాల ఘటనలకు తట్టుకునే విధంగా రక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సీసీ కెమెరాలను అమర్చి, నిరంతరం పర్యవేక్షించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించే ప్రతి ఒక్కరి సంతకం భద్రత అధికారులు రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

గులాబీ జెండా ఎగురుతుంది..

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్, మే 14 : ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురుతుందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలం అని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆత్రం సక్కు గెలుపు కోసం నిరంతరం శ్రమిస్తూ ప్రచారంలో పాల్గొన్న కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థాయిలో బలమైన కార్యకర్తలు ఉన్నారని, మండుటెండలను లెక్క చేయకుండా ప్రతి ఒక్కరూ ప్రచారంలో పాల్గొన్నారని అన్నారు. కష్టపడి పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో సింగల్ విండో చైర్మన్ అలిబిన్ హైమద్, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి సలాం, నాయకులు భీమేశ్, రవి, సుగుణాకర్, అశోక్, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

అందని కిసాన్ సమ్మాన్

- కేంద్ర పెట్టుబడి సాయానికి రైతుల ఎదురుచూపు
- నిబంధనలతో ఇబ్బందులు.. తగ్గిన లబ్ధిదారులు..

ఆదిలాబాద్, మే 14(నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వం రైతులకు పంట పెట్టుబడి సాయం అందించడంలో భాగంగా అమలు చేస్తున్న కిసాన్ సమ్మాన్ యోజన పథకం అర్హులకు అందడం లేదు. తెల్లరేషన్ కార్డు ఉన్న రైతులకు ఎన్ని ఎకరాల భూమి ఉన్నా ఏడాదికి మూడు విడుతల్లో రూ.6 వేలను కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. 2019 ఫిబ్రవరిలో ప్రారంభమైన ఈ పథకం ఆదిలాబాద్ జిల్లాలో 95,138 మందికి కేంద్ర ప్రభుత్వం సాయం అందించింది. నిబంధనల ఫలితంగా లబ్ధిదారుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం జిల్లాలో కేవలం 41,978 మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతున్నది. ఆదిలాబాద్ జిల్లాలో 3,579, బజార్‌హత్నూర్‌లో 2627, బేలలో 3308, భీంపూర్‌లో 2232, బోథ్‌లో 3754, గాదిగూడలో 1353, గుడిహత్నూర్‌లో 2487, ఇచ్చోడలో 2630, ఇంద్రవెల్లిలో 2299, జైనథ్‌లో 4575, మావలలో 150, నార్నూర్‌లో 1445, నేరడిగొండలో 2798, సిరికొండలో 1277, తలమడగులో 3426,

తాంసిలో 1538, ఉట్నూర్‌లో 2452 మంది రైతులకు మాత్రమే కిసాన్ సమ్మాన్ డబ్బులు వస్తున్నాయి.

ఐదేళ్లుగా ఎదురుచూపు

కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా లబ్ధిపొందడానికి రైతులు ఐదేండ్లుగా ఎదురు చూస్తున్నారు. ఈ పథకం కటాఫ్ తేదీ ఫిబ్రవరి 1, 2019గా నిర్ణయించగా, అప్పటి నుంచి భూములు కొనుగోలు చేసిన, వారసత్వ బదిలీ జరిగిన లబ్ధిదారుల వివరాలు ఈ పథకంలో నమోదు కావడం లేదు. అధికారులకు కూడా స్పష్టమైన అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కేసీఆర్ ప్రభుత్వం గిరిజనులు సాగు చేస్తున్న 15 వేల ఎకరాలకు అటవీహక్కు పత్రాలను పంపిణీ చేసింది. వీటికి బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఎకరాకు రూ.10 వేలు పంపిణీ చేసినా, కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ డబ్బులు అందించడం లేదు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు రైతులకు శాపంగా మారుతున్నాయి. నిబంధనల మేరకు రైతులు తమ వివరాలను మీ సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి. ఫోన్ నంబర్‌కు ఆధార్ సంఖ్య అనుసంధానం చేసుకోకపోవడం, రెండు, మూడు ఫోన్ నంబర్లు ఉండడం, రైతుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం లేకపోవడం, ఈకేవైసీ చేయించుకోకపోవడంతో రైతుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. ఈ పథకం ప్రారంభంలో ఉన్న సంఖ్య ఇప్పుడు సగం తగ్గింది. అర్హులైన రైతులకు ఈ పథకం వల్ల లబ్ధి చేకూరక పోగా ఉన్న రైతులు కేంద్ర సాయం వస్తుందో, రాదో తెలియని పరిస్థితి నెలకున్నది.

గుబిడి శివారు సూర్యగుట్ట అటవీప్రాంతంలో మోడువారిన చెట్లు

భీంపూర్, మే 14 : రెండు నెలలుగా ఎండలు దంచికొడుతున్నాయి. ఏకధాటిగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. చెట్ల ఆకులు రాలి కళతప్పుతున్నాయి. పచ్చదనాన్ని పంచాల్సిన చెట్లు మోడువారుతున్నాయి. ఇలా ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని సరిహద్దున గల గుబిడి, టేకిడిరాంపూర్ శివార్ల సూర్యగుట్ట ప్రాంతం అడవిలో అన్ని రకాల చెట్లు ఆకురాలి పచ్చదనం లేక వెలవెలాబోతున్నాయి. ఇంకొన్ని చోట్ల మైదానం, ఎడారిలా కనిపిస్తున్నది.

గిరిగామలో పశువుల తొట్టె శిథిలావస్థలో ఉందని చూపిస్తున్న పశు పెంపకం దారుడు

మూగజీవాల దాహం కేక

నీరు దొరుకక ఇబ్బందులు పడుతున్న పశువులు

- మరమ్మతులకు నోచుకొని నీటి తొట్లు
- వినియోగం లేక శిథిలావస్థకు.. చోద్యం చూస్తున్న అధికారులు
- తొట్టెకు పైపులైన్ ఏర్పాటు చేయాలని ప్రజల వినతి

తాంసి, మే 14 : దాహం తీర్చుకునేందుకు పశువులు ఇబ్బందులు పడుతున్నాయి. గిరిగామ, లింగూడ, అట్నంగూడతోపాటు ఆయా గ్రామాల్లో నీటి తొట్లు ఉన్నా నిరుపయోగంగా మారాయి. ఫలితంగా చెరువులు, వాగులు లేక నీటి చుక్కల కోసం వెంపర్లాడుతున్నాయి. దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం లక్షలు ఖర్చు చేసి నిర్మించిన తొట్లకు పైపులైన్ ఏర్పాటు చేయకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. కొన్ని నీటి తొట్లు నిర్మించిన నాటి నుంచి ఇప్పటి వరకు వినియోగంలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో నీటి తొట్లు నిరుపయోగంగా ఉన్నాయి. తొట్లు గురించి పట్టించుకునే వారే కరువయ్యారు. బోరు బావులు ఉన్న ప్రదేశాల్లో వృథా నీరు తొట్లలోకి చేరుకునేలా నిర్మించాల్సి ఉన్నా.. అందుకు అనుగుణంగా నిర్మాణాలు జరగలేదు.

చుక్క నీరు లేదు..

మండుటెండలో గోదాలకు నీరు లేక అరిగోస పడుతున్నాయి. గ్రామాలకు అనుకుని వాగులు లేక నీరు దొరకడం లేదు. నీటి తొట్టెల్లో నీరు లేదు. పశువుల గోడు పట్టించుకోవాలి. నీటి సౌకర్యం కల్పించాలి.

- గంగధర్వబాయి, లింగూడ

అట్నంగూడలో నీరు లేక వెలవెలబోతున్న నీటి తొట్టె

నత్తనడక కొనసాగుతున్న రెంకొనివాగు బ్రిడ్జి పనులు

ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన మార్గంలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

నత్తనడక

రెంకొనివాగుపై వంతెన పూర్తయ్యేదెన్నడో..

- నిర్మల్, మంచిర్యాల జిల్లాల ప్రజలకు తప్పని ఇబ్బందులు
- వానకాలంలోపు పూర్తి చేయాలని కోరుతున్న ప్రజలు

ఖానాపూర్, మే 14 : ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలకు రాకపోకలు, వాహనదారులకు రోడ్డు కష్టాలు తప్పడం లేదు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని రెంకొనివాగుపై ఆర్ఎండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో వంతెన నిర్మిస్తున్నారు. పక్షం రోజులుగా పనులు నిలిచిపోయాయి. ఇలా అయితే వంతెన ఎప్పుడు పూర్తవుతుందోనని ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్–మంచిర్యాల జిల్లాలకు ఈ మార్గం ద్వారా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. దశబ్దాల కాలం నాటి రెంకొనివాగుపై వంతెన కాలం చెల్లడంతో జనవరి 27న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు నూతన వంతెన నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఇందుకు ప్రభుత్వం రూ.5.20 కోట్లు మంజూరు చేసింది. దిలావర్‌పూర్, తర్లపాడు గ్రామాలకు వెళ్లే మార్గంలో రెండు వంతెనల పనులు నత్తనడక సాగడంతో ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. మూడు నెలలు గడుస్తున్నా వంతెనల నిర్మాణం ఫిల్లర్ల దశలో ఉండడంతో రానున్న వానకాలంలో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి పనులను చక చకా సాగేలా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

తాత్కాలిక రోడ్డుతో ఇబ్బందులు

వంతెన నిర్మాణ పనులు జరగడంతో ప్రయాణికులు, వాహనదారుల సౌకర్యార్థం పక్కన అప్రోచ్ రోడ్డు వేశారు. భారీ వాహనాలు, బస్సులు వెళ్లడంతో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.తాత్కలిక రోడ్డుపై మొరంవేసి చదును చేయించాలని కోరుతున్నారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో బ్రిడ్జి నిర్మాణంపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. మంచిర్యాల జిల్లా నుంచి తమ అవసరాల కోసం ఖానాపూర్ మీదుగా నిర్మల్ వచ్చి పోయే ప్రజలు బ్రిడ్జి పనులు నత్తనడకన సాగడంతో కాంట్రాక్టర్, అధికారులు, పాలకులపై శాపనార్థాలు పెడుతున్నారు.

వానకాలం ప్రారంభంలోగా పూర్తి చేయాలి..

రెంకొనివాగు వద్ద నిర్మిస్తున్న వంతెన పనులను వేగవంతం చేయాలి. సరైన తాత్కాలిక రోడ్డు లేక ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి. వచ్చే జూన్ నెల లోపు పనులు పూర్తి చేయాలని కోరుతున్నాం. వంతెన పనులు పూర్తి కాకుంటే వానకాలం నిర్మల్, మంచిర్యాల జిల్లాల ప్రజలకు అరిగోస పడాల్సి వస్తుంది. సార్లు వంతెన పనులపై దృష్టి సారించి వానకాలం ప్రారంభంలోగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా.

- కడారి భీరయ్య, ప్రయాణికుడు.

బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోవాలి..

ఆదిలాబాద్ వన్ టౌన్‌లో ఫిర్యాదు చేసిన ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ

ఎదులాపురం, మే 14 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో దౌర్జన్యంగా ప్రవర్తించి భౌతికదాడులకు పాల్పడిన బీజేపీ నాయకులు, రౌడీషీటర్లపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వన్ టౌన్‌లో బాధిత మహిళలతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సభ్యసమాజం తలదించుకునేలా దుర్భాషలాడిన ఎమ్మెల్యే పాయల్ శంకర్ తనయుడిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఆయన అండదండలతో రెచ్చిపోయిన తిర్పెల్లి, ఖిల్లా పర్కొట కాలనీకి చెంది నాయకులపై చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు జొన్నల కొనుగోలు నిలిపివేత

తాంసి, మే 14 : మండలంలోని సబ్ మార్కెట్ యార్డులో జొన్నల నిల్వలు నిండుకోవడంతో బుధవారం జొన్నల కొనుగోళ్లను నిర్వహించడం జరగదని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో కేశవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని రైతులు ఈ విషయాన్ని గమనించి మార్కెట్ యార్డుకు జొన్నలు తీసుకురావద్దని తెలిపారు. గురువారం యథావిధిగా కొనుగోళ్లు చేపడుతామని తెలిపారు. ఈ విషయాన్ని మండల రైతులు గమనించి సహకరించాలని కోరారు.